


# పెళ్ళయింది

మోపిదేవి దుర్గాప్రసాదరావు

మనసంతా గందరగోళంగా వుంది. సాయంకాలపు చల్లటిగాలి, టాంక్ బండ్ మీద పచార్లుచేస్తున్న నా శరీరానికి హాయినిస్తోందేగాని, మనస్సు మాత్రం లావాలా కుతకుతలాడిపోతోంది.

అడగందే అమ్మయినా పెట్టదన్న సామెత నాపట్ల నిజం అయింది. చదువయిపోగానే, అదృష్టవశాత్తు వెంటనే హైద్రాబాదులో ఉద్యోగం దొరికింది (లాకాయి లూకాయి ఉద్యోగం కాదు. నెలకు ఎనిమిది వందలు తెచ్చి పెట్టేది). "నేను ఒక్కదాన్ని ఈ పల్లెటూళ్లో వుండి ఏమి చేస్తాను!" అంటూ అమ్మకూడా వున్న మూడెకరాలు అమ్మేసి నాతోపాటు వచ్చేసింది. ఆ డబ్బుతో చిక్కడపల్లిలో మంచి ఇల్లొకటి కొన్నాను. ఉద్యోగం దొరికిన మొదట్లో 'అడ్డగాడిదా, పెళ్ళిచేసుకోరా!' అంటూ రోజూ ముచ్చటగా మూడుసార్లు అడిగేది అమ్మ. పెళ్ళిచేసుకోవాలన్న ఉబలాటం లోపలఉన్నా పైకి మాత్రం, "అప్పుడే పెళ్ళేమిటమ్మా! ఈ గుంజాటన ఇప్పుడప్పుడే నా కొద్దు" అనేవాడిని. ఇలా అనడంలో "నువ్వు మరో రెండుసార్లు అడిగితే ఒప్పుకుంటాను" అన్న అర్థం ధ్వనింపచేయాలని నా ఉద్దేశం.

నా కర్మగాలి మా అమ్మ మరో విధంగా అర్థంచేసుకుంది. నాన్న లేకపోవడం, ఒక్కడినే కొడుకు నవటం– మొదలైన కారణాలవల్ల తనదగ్గర ఏవిషమైనా చెప్పడానికి నాకు స్వాతంత్ర్యం వుంది. అందువల్ల నేను నిజమే చెప్పుతున్నాననుకొని నిట్టూర్చి, 'ఏమిటోరా నీ మొండి పట్టుదల' అన్నప్పుడల్లా, "అబ్బే, మొండి పట్టుదలంటూ ఏమీ లేదమ్మా!" అంటూ ఒక చిన్న హింట్ పడేస్తుండేవాడిని. అయినా ప్రయోజనం లేకపోయింది.

ఇహ లాభంలేదనుకొని, "నీ ఇష్టం! కొడలు రావాలని నీకంత ఇదిగా వుంటే అలాగే కానివ్వు!" అనేసి ఒకమెట్టు క్రిందకు దిగిపోయానేమోనన్న భయంతో "ఇప్పుడే చెప్పేస్తున్నాను. ఆ తర్వాత వచ్చే ఫలితాలకు మాత్రం నేను బాధ్యున్ని కాను," అన్నాను.

దానితో అమ్మకు కోపం వచ్చేసింది "అయితే ఏవిట్రా నువ్వనేది? నా పోరు పడలేక, నీ కిష్టంలేకపోయినా ఇప్పుడు పెళ్ళిచేసుకుంటా నంటావు; ఆ తర్వాతేమో ఆ వచ్చేదానితో సరిగ్గా కాపురం చెయ్యకుండా మీరిద్దరూ తన్నుకుంటూ, తిట్టుకుంటూ తిరుగుతుంటే నన్ను చూడమంటావు! అంతేనా నీ అభిప్రాయం!...సరే, నేనూ ఇప్పుడే చేప్పేస్తున్నాను. ఇహ నీ పెళ్ళివిషయం ఎప్పుడైనా ఎత్తితే అప్పుడడుగు" అంటూ ఆ విషయం కదిలిచండం మానేసింది అమ్మ.

పనిచేస్తుందనుకున్న పాశుపతాస్త్రం ఎదురుతిరగడంతో ఏమీ చేయలేక నోరు మూసుకున్నాను. కాని మనస్సు మాత్రం వూరుకోవడంలేదు. స్కూటరు మీద వెళ్ళుతున్న జంటను చూసినప్పుడల్లా నా స్కూటరు వెనకాల కూర్చున్న శాస్త్రిగాడిని ఒక్క తన్ను తన్ని నేలమీద పడేద్దామా అనిపించేది. సినిమా చూడకుండా ఒహటే కబుర్లు చెప్పుకుంటున్న కొత్త దంపతులను చూచినప్పుడు మా ఆఫీసులో పనిచేస్తున్న సునందను సినిమాకు తీసుకువచ్చివుంటే బాగుండేదనిపిస్తుంది. ఆ వెంటనే సునందకు పెళ్ళయిపోయిందని గుర్తుకొచ్చి నిట్టూర్పులు వదుల్తూ కూర్చోనేవాడిని.

నా మీద కోపంతో పెళ్ళివిషయం కదపటం మానేసిన అమ్మ ఆరునెలలు తిరిగేసరికి ఇహ ఆగలేక మళ్లీ ప్రారంభించింది. ఈ అదనుకోసమే కాచుకు కూర్చున్న నేను ఈసారి పిచ్చివేషాలు వేయదలచుకోలేదు. వెధవ డాంభికాలన్నీ వదలి దాసోహమనడమే శరణ్యమనుకున్నాను.

"నీ మాటెప్పుడు కాదన్నాను" అంటూ మహాగట్టిగా బుర్ర వూగించాను.

కొండంత సంబరంతో అమ్మ పెళ్ళి సంబంధాలు చూడటం మొదలుపెట్టింది. కొన్ని ఆవిడకు నచ్చలేదు. మరికొన్ని నాకు నచ్చలేదు. ఈ లోపల మఖన్ లాల్ సేఠ్ జీ ఇహం, పరం సంపాదించేద్దామన్న యావతో 'యాత్రా స్పెషల్ రైలు' నడపటం ప్రారంభించాడు. తనకుతెలిసిన

వాళ్ళు చాలామంది ఆ రైల్లోనే యాత్రలకు వెళ్తున్నారని తెలిసి అమ్మకూడా అందరి దేవుళ్ల దర్శనాలు చేసుకోవాలంటూ ఉబలాటపడి రెండు నెలల క్రితం వెళ్ళిపోయింది. మరో రెండు నెలల వరకూ రాదు. పోనీ ఆ వెళ్ళేదేదో నాకు పెళ్ళిచేసి వెళ్ళి పోవచ్చుగదా! అహా అలాకాదు. తల్లియి కూడా, తనొక్కతే పుణ్యం మూటకట్టేసుకుందామన్న స్వార్థంతో వెంటనే బయల్దేరి వెళ్ళిపోయిందిగానీ, 'అయ్యో! ఒక్కగానొక్క కొడుకు-ఇన్నాళ్ళకు పెళ్ళికి ఒప్పుకున్నాడు - వాడి పెళ్ళి కళ్లరా చూచి అప్పుడు యాత్రలు చేసుకుందాం' అన్న ఆలోచన ఆవిడకు రాలేదు.

'మనష్యులంతా నిమిత్త మాత్రులు. వాళ్ల చేతుల్లో ఏమీలేదు' అను పెద్దలెందుకంటారో ఇప్పుడర్థమైయింది.

ఆలోచిస్తూ అటూ ఇటూ పచార్లు చేస్తున్నాను. అందరూ హాయిగా, సంతోషంగానే వున్నట్టున్నారు నేను తప్ప. బొడ్డుక్రిందకు కట్టుకున్న ఎర్రచీర గుజరాతీ అమ్మాయి నావైపే చూస్తోంది. జుట్టు సర్దుకొని తల మరో వేపుగా తిప్పుకొని మధ్య మధ్యలో ఆ అమ్మాయి వంకే దొంగ చూపులు చూస్తున్నాను.

"హల్లో రవణా! కొద్దిగా ఆలస్యమయింది."

తియ్యటి కోకిల కంఠం పలకరించడంతో వెనక్కు తిరిగాను. ఎవరో అమ్మాయి నవ్వుతూ నిలబడి వుంది. పరిచయంలేని మొహం .

తడబడుతూ, "సారీ, నా పేరురమణ కాదు" అన్నాను. ఆ అమ్మాయి తియ్యగా నవ్వింది.

"పొరపాటు నాది. నేను బయల్దేరే ముందు అమ్మ మరీ మరీ చెప్పింది, నిన్నా పేరుతో పిలవకూడదని. మర్చిపోయి అలవాటయిన పేరుతో పిలిచాను. ఏమీ అనుకోవుగా?" ప్రాధేయపూర్వకంగా నావంకే చూస్తోంది.

"చూడండి! నా పేరు రమణకాదు, సుబ్బారావు. మీరెవరో గాని నాకు తెలిసిన వారిలా కనిపించడంలేదు. బహుశా మీరు పొరపాటు పడ్డారనుకుంటాను," అంత చనువుగా మాట్లేడేస్తున్న అమ్మాయితో 'నువ్వెవరివో నాకు తెలియదు' అని చెప్పాల్సి వచ్చినందుకు బాధపడుతూ అన్నాను.

"నన్నెప్పుడూ చూడలేదు కదా నువ్వు, అందుకని నే నెవరినో నీకు తెలియదు. ...నేను ప్రీతిని. మీ మేనత్త సూర్యకాంతం గారి అమ్మాయిని...... ఏమిటి ఇప్పటికైనా గుర్తు కొచ్చానా రమణా... సారీ సుబ్బారావ్?"

గబగబ మా మేనత్తల పేర్లు, అత్త వరస అయినవారి పేర్లు గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నించాను. ఎంత ప్రయత్నించినా నాలుగు పేర్ల కంటే ఎక్కువ గుర్తు రాలేదు. ఈ నాలుగు పేర్లలోనూ ఖచ్చితంగా సూర్యకాంతం పేరు మాత్రం లేదు.

"మా అమ్మ రాకుండా, నే నెందుకు వచ్చానా అని ఆలోచిస్తున్నావు కదూ? కారణం చాలా సింపుల్. నీ వుత్తరం చూడగానే మొదట్లో అమ్మే రావాలనుకుంది. నీకు తెలుసో తెలియదో అమ్మకు ఈమధ్యటైఫాయిడ్‌వచ్చిమంచమెక్కింది జ్వరమైతే తగ్గింది కాని చాలా నీరసంగా ఉంది. అందుకని బొంబాయి నుంచి ఇక్కడదాకా ప్రయాణం చేయడం కష్టమని నన్ను వెళ్లమంది. ఈ సంగతి ముందుగానే నీకు వుత్తరం రాద్దామనుకుంటే నువ్వేమో అడ్రస్సు ఇవ్వలేదటగా? సరే, అమ్మేమో నీ ఫోటో చూపించింది. నువ్వు ఈ రోజు టాంకుబండ్ దగ్గర ఏరకమైన బట్టలు వేసుకొని సరిగ్గా ఎక్కడ నిలబడతావో రాశావుగా...... ఇదిగో ఆ గుర్తులన్నీ ఈ పేపరుమీద రాసుకున్నాను... వీటన్నిటి సాయంతో ఇంతకు ముందు నిన్నెప్పుడూ చూడకపోయినా వెంటనే గుర్తు పట్టేశాను..." ఊపిరి పీల్చుకొవడానికి ఆగింది.

అమ్మయ్య! అసలు సంగతి ఇప్పటికర్థమయింది. ఈ అమ్మాయిది బొంబాయన్నమాట. ఈవిడగారు ఇంతకు ముందు ఎప్పుడూ చూడని బావగారిని కలుసుకోవడానికి ఫోటో సాయంతో బయల్దేరిందన్నమాట...... అయినా, నా కర్థంగాని విషయం మరొక్కటుంది. ఆ బావగాడెవడో మేనత్తను ఇంటికి రమ్మనక టాంక్‌బండ్ దగ్గరుంటాను రమ్మనడ మేమిటి? ఇందులో ఏదో తిరకాసుంది. ఆ వెధవగాడెవడో, ఇంకో ఆడదానితో కాపురంపెట్టి, ఈ సంగతి ఈ అమ్మాయికి, మేనత్తకు తెలియకుండా నాటకమాడుతుండాలి.

"బావా! ఫోటోలోకంటే అందంగా ఉన్నావు నువ్వు," అని చెప్పి బోలెడు సిగ్గుపడిపోయింది ప్రీతి.

నాకూ కొంచెం సిగ్గేసింది కానీ, కొంచెం గర్వంగా నవ్వాను. అలా నవ్వుతూ ప్రీతివంక పరీక్షగా చూశాను.

గులాబిరంగు టెరికాట్ చీర వంటి రంగుతో కలిసిపోయింది.అమాయకత్వం తొణికిసలాడుతున్న అందమైన మొహం. పల్చటి పెదాలు. టాంక్‌బండ్‌మీద చల్లటి గాలి మాకూ తగలనీ అని మారాం చేస్తున్నట్టున్న రొమ్ములు. ఇంతటి అందాలరాశి నాకు మరదలు కానందుకు విచారం పెల్లుబికింది. పైగా ఆ అమ్మాయికి మరొకడికి అందులోనూ ఆమెను మోసంచేస్తున్నవాడికి మరదలు కావడం ఉక్రోషం కలిగించింది నాలో.

"ఏవిటి రమ...సారీ సుబ్బారావ్! ముంగిలా మాట్లాడకుండా అలా నిలబడతావేం? నేను రావడం నీ కిష్టం లేదా?" నిష్ఠూరంగా అంది ప్రీతి.

"ఛ ఛ, అదేంలేదు. కానీ చూడండి, మీరు పొరపాటు......"నేనింకా వాక్యం పూర్తి చేయనేలేదు.ఆవిడ కలిపించుకుంది.

"మళ్ళీ అదేమాటా!..." అంటూ

ఏదో గుర్తుకొచ్చినదానిలా, "అవున్లే, నీ జాగ్రత్తలో నువ్వుండటం మంచిదే..... పోనీ ఒక పని చేద్దామా? నాహోటల్ గది కెళ్ళి మాట్లాడుకుందాం. అక్కడయితే ఎవ్వరూ వుండరు," అంటూనే అటువేపుగా పోతున్న టాక్సీని పిలిచి కూర్చుంటూ, "రిట్జ్ హోటల్‌కు పోనివ్వు" అంది.

తటపటాయిస్తూ నిల్చున్న నన్ను చూసి, "అబ్బ ఏమిటి బావా! ఇంకా ఆలోచన తెగలేదా?... త్వరగా కూర్చో," అంటూ చెయ్యిపట్టుకుని గుంజింది. అమ్మాయి చెయ్యి తగలగానే కళ్లముందు మెరుపు మెరిసినట్లయింది. మెరుపునుచూసినతర్వాత ఒక్కనిమిషం మన కళ్లకు ఏమీ కనిపించకుండా పోతుందే అలా అయింది-నా బుర్ర. అనాలోచితంగా చుట్టుపక్కల చూసి టాక్సీలో కూర్చున్నాను.

"నువ్వెప్పుడూ ఖరీదైన హోటళ్లలోనే భోజనం చేస్తావటగా?... అమ్మ చెప్పింది. నిన్నంతా రిట్జ్ హోటల్లో భోజనాలకు వచ్చినవాళ్లందరినీ చూస్తూకూర్చున్నాను. నువ్వేమో రాలేదు."

ప్రీతి మెత్తని వళ్లు రాసుకుంటుంటే స్వర్గంలో వున్నట్టనిపించింది. ఎలాగూ ఈ అమ్మాయి నేను తన బావను కాదంటే ఒప్పుకోవడంలేదు కాబట్టి, మాటిమాటికి అరిగిపోయిన గ్రామఫోనురికార్డులా 'మీరు పొరపాటుపడుతున్నారు... పొరపాటు పడుతున్నారు... పొరపాటు...' అంటూ చెప్పడం మానేద్దామనుకున్నాను.

"నువ్వంటే నాకు ఆరాధన అనుకో రమణా! ఇరవైయయిదేళ్లకే ఎన్నెన్ని దేశాలు తిరిగావు! ఎన్ని రకాల మనుషులను చూశావు!... అబ్బ తలుచుకుంటేనే అదోలా వుంది......నువ్వంటే నాకు చాలా ఇష్టం బావా!''

అలా ఆ అమ్మాయి ఒకసారి వరస పెట్టి, మరోసారి పేరుపెట్టి పిలుస్తుంటే విన సొంపుగావుంది.



ప్రీతితోపాటు నేనూ నవ్వాను. "అవును, అత్తయ్య చెప్పింది-నువ్వెప్పుడూ బావ, బావ అని కలవరిస్తావని."

ఈ మాటలు అన్న తర్వాత ఆశ్చర్యమేసింది నాకు. ఏమిటి నేనే... నేనే ఈ మాటలు అన్నది... ఒక ఆడపిల్లతో, అదీ భువనైకమోహినితో మాట్లాడగలగడమే కాకుండా చాలా చక్కగా నటిస్తున్నాను కూడా...మై గుడ్‌నెస్...సుబ్బారావు మారిపోయాడు. ...మారిపోయాడు పూర్తిగా.

"నా గురించి అత్తయ్య ఇంకా ఏమేమిటి చెప్పింది!" బ్రహ్మాండంగా నటించేస్తున్నానన్న సంతోషంలో ప్రశ్నలు వేయడం ప్రారంభించాను.

యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు నాటకాల్లో వేషం వెయ్యడానికి నేను పనికిరానని కసిరికొట్టిన ఆ వంకాయ మొహం మాస్టారు ఇప్పుడు మనల్ని చూడాలి. మన నటన చూసి గుండెలు బాదుకొని చచ్చి వూరుకుంటాడు.

ప్రీతి చెప్పేదంతా శ్రద్ధగావింటున్నాను. ఆవిడ మాటలనుబట్టి నాకు తెలిసింది ఇది— ఈ అమ్మాయి బావపేరు రమణ. అతగాడు ఓ పెద్ద స్మగ్లర్. మనదేశం లోనుంచి విగ్రహాలు, శిల్పాలు బయట దేశాలకు అమ్ముతూ, అక్కడనుంచి బంగారం, వజ్రాలు ఇండియాకు దొంగతనంగా చేరుస్తుంటాడు. సంవత్సరం క్రితం ఒక రాముడి విగ్రహం దొంగతనంగా అమెరికాలోని ఒక కోటీశ్వరుడికి అమ్మబోతుండగా పోలీసులకు ఆచూకీ దొరికింది. అప్పటి నుంచి అతగాడు పోలీసులకు దొరకకుండా తప్పించుకుంటూ ఊరూరు తిరుగుతున్నాడు. రెండునెలల క్రితమే హైద్రాబాదు వచ్చాడు. ఇంతవరకూ ఈ బావను ప్రత్యక్షంగా చూడకపోయినా,

ఇటువంటి సాహసకృత్యాలు (నా అభిప్రాయంలో దగుల్బాజీ పనులు) చేస్తున్న అతగాడంటే ప్రీతికి మహా అభిమానం. (నాకు నమ్మకం లేదు, ఈ మాటమీద). వీళ్లిద్దరికి పెళ్లిచేయ్యాలని సూర్యకాంతంగారి అభిప్రాయం (ట). వారంరోజుల క్రితం రమణ మేనత్తకు, "అత్తయ్యా! నువ్వు వెంటనేహైద్రాబాదు రావలసింది. ప్రీతి పెళ్లి విషయంమాట్లాడుదాం. నేను...తారీఖున టాంక్ బండ్ దగ్గర ఎర్రగళ్ల చొక్కా, నల్లపాంటు వేసుకు నిలబడతాను" అంటూ ఉత్తరం రాస్తే అమ్మాయిగారు దిగబడ్డారు.

హోటల్ పోర్టికోలో టాక్సీ ఆగింది. డబ్బులు ఇవ్వబోయాను. ప్రీతి అడ్డు పడింది.

"నువ్వుండు బావా! నే నిస్తాను... నెలకు నాలుగొందలు నువ్వు అమ్మకు పంపుతుంటావుగా! కాబట్టి టాక్సీ డబ్బులు నే నిచ్చినా, నువ్విచ్చినట్టే లెక్క."

మెట్లెక్కి హోటల్ లో ప్రవేశించాం. రిసెప్షన్ టేబుల్ దగ్గర నిలబడ్డ ఆంగ్లో ఇండియన్ గర్ల్, ప్రీతిని చూసి అందంగా నవ్వుతూ, "గుడ్ ఈవినింగ్, మిస్". పలకరించింది. ప్రతిగా నవ్వుతూ, గదికి రెండు కాఫీ టిఫెన్లు పంపించమని ఆర్డరుపడేసింది ప్రీతి.

బాల్కనీలో కుర్చీలు వేసుకొని కూర్చున్నాం.

"నిన్ను గుర్తుపట్టగలనో లేనోనని ముందు నేనూ, అమ్మా ఎంత భయపడ్డామనుకున్నావు రమణా!" అంటూ నా వైపు అదోలా చూసి, "ఇక్కడెవ్వరూ లేరు కాబట్టి నిన్ను హాయిగా రమణా అని పిలవొచ్చు. అమ్మయ్య. ప్రాణం తెరిపిన పడింది...అయినా బావా! పేరు మార్చుకుంటేమాత్రం ఇతంకంటే మంచి పేరు దొరకలేదా నీకు. సుబ్బారావేమిటి నా తలకాయ!" అంటూ విరగబడి నవ్వింది ప్రీతి.

మంచి పేరు దొరకింది నాకు కాదు, మా అమ్మానాన్నలకు అని పాపం ప్రీతికి తెలియదు.

టిఫిన్ చేస్తున్నానన్నమాటే గాని ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి. ప్రీతిలాంటి అమ్మాయి భార్య అయితే ఎంత బాగుండును. ఉన్నట్టుండి నాకో బ్రెయిన్ వేవ్ వచ్చింది. యాత్రలనుండి అమ్మ తిరిగివచ్చేలోగా ప్రీతి మెడలో తాళికట్టేస్తే?... ఇటువంటి ప్రీతికి అటువంటి ఆవారాగాడు మొగుడవట మేవిటి... నాన్సెన్స్. వెళ్లిపోయేముందు అసలు విషయం చెప్పేసి పెళ్లిచేసుకొమ్మని అడిగేస్తే సరి. ఎలాగూ ఫోటోలోని తన బావకంటే నేనే బాగున్నానందికదా!... ....ప్రీతికి ఆ రమణగాడి సాహస కృత్యాలంటే ఇష్టమన్న సంగతి నా బుర్రలోనుంచిబలవంతంగా తుడిచివెయ్యడానికి ప్రయత్నించసాగాను.

ఆ రోజు ప్రొద్దున్నే అమ్మ వచ్చింది. తలుపు తీసిన ప్రీతిని చూసి కొయ్య బొమ్మలా నిలబడిపోయి, ఆ వెనకే వస్తున్న నన్ను చూసి తేరుకొని 'ఎవరీ అమ్మాయి' కళ్లెగరేసిన అమ్మతో, "నీ కోడలు, మమ్మల్ని ఆశీర్వదించమ్మా" అంటూ కాళ్లమీద పడబోయాను. వెంటనే కాళ్లు వెనక్కి జరుపుకుంది అమ్మ. ఎర్రబడ్డ కళ్లతో నావంక చూస్తూ, "ఛీ! అప్రాచ్యుడా! కులం గోత్రం తెలియకుండా ఎవత్తినో తెచ్చి నీ కోడలనగానే సరిపోతుందనుకున్నావా? మన ఇంటి సాంప్రదాయం చెడగొట్టిన నువ్వు నా కొడుకువికావు. నేను నీకు తల్లినీ కాను...అసలు ఇంత పని చేసిన నిన్ను ఏంచేస్తే పాపం పోతుంది" అంటూ అపరకాళిలా చెయ్యెత్తింది. 'ధన్' మన్న చప్పుడుకు ఉలిక్కిపడి చూశాను. ఆలోచనల్లో పడిపోయానేమో చెయ్యి తగిలి కాఫీ కప్పు కిందపడిపోయింది.

"అరరే ఆగాగు, కదలకు బావా! పెంకులు గుచ్చుకుంటాయి" అంటూ హడావుడిగా కాఫీకప్పు ముక్కలన్నీ అతి జాగ్రత్తగా ఏరుతున్న ప్రీతిని చూడగానే నాలో ఒక్కసారి ఆవేశం ప్రవేశించింది.

ఏదైనాసరే ప్రీతినేపెళ్లి చేసుకుంటాను! అమ్మ తనఆస్తిలో చిల్లిగవ్వఇవ్వకపోయినా సరే ప్రీతినే నా జీవితభాగస్వామి... అయినా అమ్మ అలా అనదులే. ఎంతయినా ఒక్కడినే కదా! ముందు కోప్పడినా తర్వాత నవ్వేసి వూరుకుంటుంది.

గడియారం చూసుకున్నాను, ఎనిమిదవ్వొస్తుంది.

"బావా! నువ్వేమీఅనుకోనంటేఒక్క విషయం అడుగుదామనుకుంటున్నాను!" 'అడుగు' అన్నట్టుగా నవ్వాను

"నువ్వేమీ అనుకోకూడదు మరి. నా మీద కోపంతెచ్చుకోకూడదు, సరేనా? ఏదీ, ఒట్టెయ్యి" అంటూ చాచిన చేతిలో చెయ్యివేశాను. వేసిన చెయ్యి వెంటనే వెనక్కి తీసుకోలేదు.

"నువ్విలా పోలీసులనుంచి ఎంత కాలం తప్పించుకు తిరుగుతావు రమణా? ఇప్పటినుంచయినా నువ్వు మంచివాడివిగా మారిపోకూడదూ?...రేపు మన పెళ్లైన తర్వాతకూడా నువ్విలా ఒక ఊరినుంచి మరోవూరు పారిపోతూవుంటే నిన్ను విడిచి నే నెలా ఉండగలను!" ప్రాధేయపూర్వకంగా, దీనంగా అడుగుతోంది. ప్రీతి. కళ్లు చెమర్చినట్లున్నాయి.

ప్రీతిమాటలు విన్న నాకు వెయ్యేనుగుల బలం వచ్చినట్టయింది. బావచేసే వెధవ తప్పుడు పనులు తన కిష్టం లేదన్న మాట...

మనస్సు మార్చుకున్నాను. ఇప్పుడే చెప్పెయ్యకూడదు. 'నేను నీ బావను కాను' అని. రెండు రోజులు తనతోపాటు

తిరిగి నా మంచితనం గమనించాక నే నెవరినో చెప్పి పెళ్లిచేసుకొమ్మని అడుగుతాను. అప్పుడు తప్పకుండా ఒప్పుకుంటుంది. ఇటువంటి సీనులు ఎన్ని సినిమాల్లో చూడటంలేదు!

"తప్పకుండా మారిపోతాను ప్రీతి! నీ కోసం తప్పకుండా ఈ రోజునుంచీ మారిపోతాను," ధృఢంగా నమ్మకం కలిగించేలా అన్నాను.

"ఇహ నేను బయల్దేరుతాను. రేప్రొద్దున్నే మళ్లీ వస్తాను. జాగ్రత్తగా వుండు" అన్నాను వెళ్లిపోవడానికి ఆయత్తమవుతూ.

"అప్పుడే వెళ్లిపోతావా! సరేలే పద... నేను బయటదాకా వస్తాను... రేపు సాయంకాలంమాత్రం మంచి ఇంగ్లీషు పిక్చరుకు వెళ్దాం, సరేనా?" అంటూ చెప్పులు వేసుకుంది ప్రీతి.

ఇద్దరం హోటల్ బయటకు వచ్చాం. పండువెన్నెల విరగకాస్తోంది. వీడ్కోలు తీసుకుందామని ప్రీతివేపు తిరిగాను. ఎదురుగా వస్తున్న ఇద్దరు పెద్దమనుష్యుల వంక పరీక్షగా చూసి భయపడ్డదానిలా మొహం పెట్టింది.

"బావా! చెప్పడం మరిచిపోయాను. ఇటువేపు వస్తున్నారే ఆ ఇద్దరూ నన్ను బొంబాయినుంచి వెంబడిస్తున్నారు. ఒకవేళ నేను నిన్ను కలుసుకోవడానికి వస్తున్నానన్న సంగతి తెలిసి నన్ను ఫాలో అవుతున్న సి.ఐ.డీ.లేమో వాళ్లు.'' కంగారుపడిపోతోంది ప్రీతి.

ఇంతలో ఆ ఇద్దరూ మాకు దగ్గరగా వచ్చారు. ఒకతను నల్లగా లావుగా వున్నాడు. మరోఅతను ఎర్రగా పొడుగ్గా వున్నాడు.

"మిస్టర్ రమణా! మేము సి.బి.ఐ.కి చెందినవాళ్లం. బంగారం, వజ్రాలు స్మగుల్ చేస్తున్నందుకు నిన్ను అరెస్టు చేస్తున్నాం" అంటూ జేబులో చెయ్యి పెట్టి ప్లాస్టిక్ అట్టలు రెండు తీసి "ఇవి మా ఐడెంటిటీ కార్డులు" అన్నారు.



"నే ననుకున్నంతా అయింది'' అంటూ వెక్కివెక్కి ఏడుస్తున్న ప్రీతి భుజం మీద చెయ్యివేసి తట్టుతూ "మీరు పొరపాటుపడుతున్నారు. నా పేరు సుబ్బారావు'' అన్నాను ఆ ఇద్దరితో.

"సరే లెండి. మాకు దొరికిపోయిన ప్రతినేరస్తుడు ముందిలాగే దబాయిస్తాడు. మీరు వెంటనే బయల్దేరండి. పోలీస్ స్టేషన్‌కు వెళ్దాం" ఎగతాళిగా నవ్వారు.

"నా మూలంగానే ఇదంతా జరిగింది రమణా, సారీ సుబ్బారావు," అంటూ గుడ్లనీరుకుక్కుంటున్న ప్రీతితో, "ఏం భయంలేదు ప్రీతి, వీరితోమాట్లడి మరో గంటలో నీదగ్గరకు వచ్చేస్తా"ను అంటూ ధైర్యంతో వాళ్లతోపాటు ముందుకు నడిచాను.

ముగ్గురం టాక్సీలో కూర్చున్నాం.


"చూడండి! మీ పేర్లేమిటో తెలియదు..." అంటూ ప్రారభించబోయాను. వెంటనే నల్లతను అందుకొని, ''నాపేరు రంగయ్య. ఇతనిపేరు కుమారస్వామి" అన్నాడు.

"రంగయ్యగారు! మీరు చాలా పొరపాటుపడుతున్నారు. నాపేరు రమణ కాదు, సుబ్బారావు.. చదలవాడ సుబ్బారావు. గత రెండేళ్లగా ఈ వూళ్లోనే నా స్వంత ఇంటిలో ఉంటున్నాను. వజీర్‌సుల్తాన్ టొబాకో కంపెనీలో పని చేస్తున్నాను.

నా కంఠంలోని ధైర్యం గమనించి అనుకుంటా రంగయ్య కొద్దిగా ఆశ్చర్య పడ్డాడు. కుమారస్వామి మాత్రం నవ్వుతూ, "మిస్టర్ రమణా! ఈ కాకమ్మ కబుర్లు నాదగ్గర చెప్పొద్దు. నీ పేరు సుబ్బారావు అయితే మరి ఆ అమ్మాయి 'రమణా' అని పిలిచిందే?" అన్నాడు.

"అది నా ఆంతరంగిక విషయం లెండి" అంటూ ఇహ కుమారస్వామితో లాభంలేదనుకొని రంగయ్యవైపు తిరిగాను.

"నామాట వినిపించుకోండి రంగయ్యగారూ! ఇవ్వాళ కాకపోయినా రేపైనా నిజం తెలుస్తుంది మీకు. మీ పై అధికారులు ఒకమనిషికి మరొకడిని తెచ్చినా




మిమ్మల్ని చూసి నవ్వుతారు. అది మీ కారెక్టరుకు దెబ్బకూడాను."

రంగయ్య ఏదో ఆలోచనలో పడ్డాడు. ఇదే సమయమనుకొని మళ్లీ ప్రారంభించాను.

"మీరు కష్టమనుకోకుండా ఇదే టాక్సీలో మా ఇంటికొస్తే నేను సుబ్బారావునేనని ఋజువులు, ఆధారాలు చూపిస్తాను."

రంగయ్య సాలోచనగా కుమారస్వామి వైపు చూశాడు. అతగాడు మాత్రం ఒక విషపు నవ్వు నవ్వాడు. "ఏంవిటోయ్, మరీ అంత ఇదిగా ఆలోచిస్తావ్! ఇటువంటి విచ్చిక బుర్లు మనం ఇంతకుముందు ఎన్ని కేసుల్లో వినలేదు. మామూలు పాటే గదా!"

పోనీ ఇతగాడింటికెళ్లి చూద్దాం! ఇతగాడు రమణే అయితే సరేసరి. అలా కాకుండా కొంపతీసి ఇతగాడు నిజంగా సుబ్బారావే అయితే రేపు మనకు నలుగురిలో తలవంపులు కదా! అదీ కాకుండా ఇతగాడి ఇంటికి వెళ్లితే మన అదృష్టం బాగుండి ఆ విగ్రహం విషయం ఏమైనా తెలియొచ్చు!" నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు రంగయ్య.

"నీకంత ఇదిగావుంటే అలాగే కానివ్వు" అని కుమారస్వామి అనగానే 'బ్రతుకుజీవుడా' అనుకుంటూ టాక్సీవాడికి మా ఇంటిగుర్తులు చెప్పాను.

మరో పావుగంటలో ఇల్లు చేరాం. టాక్సీవాడితో ఒక అరగంట ఆగమని తలుపుతాళంతీసి ముందుగదిలో రంగయ్యనూ, కుమారస్వామిని కూర్చోబెట్టాను.

గబగబా నా బ్యాంకు పాసుబుక్కు, చెక్కుబుక్కు చూపించాను. నా అపాయింట్‌మెంట్ ఆర్డరు చూపించాను. స్నేహితులు నాకు రాసిన ఉత్తరాలు వాళ్లముందు గుట్టలుగా పోశాను.

ఇవన్నీ చూసిన రంగయ్య పూర్తిగా మారిపోయాడు నిజంగానే పొరపాటు జరిగిపోయిందన్న విచారం అతని మొహంలో కనిపించసాగింది. కుమారస్వామి మొహంలో రంగులు మారడం గమనించాను. కానీ అతగాడు నిలదొక్కుకున్నాడు.

"ఇటువంటి కేసులు చాలా చూశాను నేను. మీరు పేరుమార్చుకొని, మరెవడో సుబ్బారావు కాగితాలు దొంగిలించి సుబ్బారావు పేరులో చలామణి అవుతూ వుండొచ్చు. కాబట్టి మీరు సుబ్బారావేనని, రమణకాదు అనుకోవడానికి మాకు మరిన్ని ఆధారాలు కావాలి. మీరేమీ అనుకోనంటే మీకోమాట చెప్తాను. మీ ఇల్లంతా సోదా చేస్తాను నేను. అప్పటికీ మీరు రమణేనన్న ఆధారాలు మాకు దొరక్కపోతేమిమ్మల్ని వదిలివేస్తాం..." అంటూ మొదలుపెట్టాడు కుమారస్వామి.

"మరి సెర్చివారంటు లేకుండా..." అంటూ నసిగాను.

"సరేలెండి. అదీ పాయింటే. మీకిష్టం లేకపోతే పదండి పోలీస్‌స్టేషనుకుపోదాం. ఈ రాత్రికి అక్కడే గడిపెయ్యండి. రేపు మీ ఆఫీసుకు వెళ్లి కనుక్కుందాం!" వెళ్లిపోవడానికి సన్నద్ధమయ్యాడు కుమారస్వామి.


అయ్యబాబోయ్! వీళ్లంతా ఆఫీసుకు వెళ్లితే ఇంకేవన్నా వుందా! ప్రతివిషయం బయటకొస్తుంది... పోనీ సోదాచేయనిస్తే తప్పేవిటి? నేనేమీ తప్పుచేయలేదుగా.

తాళంచేతులు తీసి కుమారస్వామికి అందించాను, "ఇది వంటగది, ఇదేమో స్టోరుగది, మరేమో ఇది గాడ్రెజ్ బీరువాది."

"నీదంతా మరీ చాదస్తమోయ్ కుమారస్వామీ! ఈయన సుబ్బారావేనని ఇన్ని ఆధారాలు కనిపిస్తుంటే ఇంకా సోదా అంటావేమిటి? సరే కానియ్యి...త్వరగా తెముల్చు..." అంటూ నా వైపుతిరిగి, "రండి సుబ్బారావుగారూ! మనం అలా పక్కగదిలో కూర్చుందాం'' అంటూ పడకగదివేపు దారితీశాడు రంగయ్య.

మంచం మీద కూర్చుంటూ, "ఏవిటండి మీ కాలింగ్! మనిషిమాట మీద ఆ మాత్రం నమ్మకం లేకపోతే ఎలా?" నిష్ఠూరంగా అన్నాను.

"అమ్మమ్మ! అంత మాటనకండి. కుమారస్వామి మహా ఎఫిషియంట్‌లెండి. అతగాడు పట్టుకొన్న కేసు ఇంతవరకూ ఫెయిల్ కాలేదు... అందులోనూ ఈ రమణకూ చాలా పేర్లున్నాయి. అందుకని మావాడు మరీ జాగ్రత్తగా వుంటున్నాడు."




"ఇంతకూ ఆ రమణ సంగతేమిటి," కుతూహలం చంపుకోలేక అడిగాను.

"ఏం చెప్పమంటారండి. వాడో ఉద్దండపిండం. చేతికి చిక్కినట్టు చిక్కి తప్పించుకుపోతున్నాడు. రకరకాల వేషాలు, రకరకాల పేర్లు.. మహా గడుగ్గాయిలెండి. దరిదాపుగా సంవత్సరం క్రింద వింధ్యపర్వతాలలోని ఒక గుడిలోనుంచి రాముడివిగ్రహం ఎత్తుకు పోయాడు. అది అమెరికాకు రవాణచేసే ప్రయత్నం విఫలంచేశాం. ఆ విగ్రహం ఇంకా అతని దగ్గిరే వుంది. ఇదేకాకుండా అతని మీదా ఇంకాచాలా కేసులున్నాయి. అతగాడు హైద్రాబాదులో మకాంపెట్టాడని ఈ మధ్యనే తెలిసింది. వాడి మరదలు ప్రీతి...చూశారుగా... ఆ అమ్మాయి హైద్రాబాదు బయల్దేరుతోందని తెలిసి అనుమానమేసి వెంబడించాం," అంటూ ముందుకువంగి రహస్యం చెప్పబోతున్న వాడిలా మొహంపెట్టాడు రంగయ్య.

"ఆ రాముడి విగ్రహం గురించి చాలా కథవుందిలెండి. టిప్పుసుల్తాను ఆ విగ్రహంలోపల బోలుగా వుండేట్టు తయారుచేయించి, అందులో పదికోట్ల రూపాయలు విలువచేసే వజ్రాలు వుంచి దాచాడని చారిత్రిక పరిశోధకుల అభిప్రాయం. ఈ సంగతి రమణకు తెలియదులెండి."

ఆశ్చర్యంతో నోరు తెరుచుకు వింటున్నాను.

ఇంతలో తలుపెవరో కొట్టిన శబ్దం వినిపించి లేవబోయాను. రంగయ్య అడ్డుపడ్డాడు.

"అహ! మీరు కాదు నేను వెళ్లి మాట్లాడివస్తాను. మా అనుమానాలు మా కున్నాయి చూడండి. ఆ వచ్చినవాడు అనుమానాస్పదుడు కాకపోతే మిమ్మల్ని పిలుస్తాను. మీరు వచ్చి మాట్లాడవచ్చు." గబగబ గదిలోనుంచి బయటకు వెళ్లాడు రంగయ్య.

ప్రీతిమూలంగా ఎటువంటి కష్టంలో చిక్కుకున్నాను. అయినా ఇదంతా నా మంచికేవచ్చింది. తన మూలంగా ఇన్ని కష్టాలుపడ్డ నా మీద ప్రీతికి తప్పకుండా అభిమానం కలుగుతుంది.అసలే బావగాడు చేసేపనులమీద సదభిప్రాయంలేని ప్రీతి నా మీద అభిమానాన్ని అనురాగంగా మార్చుకుంటుంది. అప్పుడు నేనూ ప్రీతి ఆలుమగలం. సంతృప్తిగా నవ్వుకున్నాను.

పావుగంటయినా రంగయ్య రాలేదు. ఏమయిందాని ముందుగదిలోకి వెళ్లాను. వీధితలుపులు బార్లా తెరిచి వున్నాయి.

ఇటూ అటూ చూస్తున్న నాకు తెరిచి వుంచిన బీరవాతలుపులు కనిపించాయి. గబగబవెళ్లి చూశాను, అదురుతున్న గుండెలు అదుపులోపెట్టుకుంటూ. వంట గదిలోకి వెళ్లిచూశాను. గబగబ గదులన్నీ వెదికి చూశాను. ఖరీదుగల ప్రతివస్తువూ మాయమయింది.

ఆడపిల్ల పెళ్లిచేసినతర్వాత ఇల్లు గుల్లవుతుందంటారు పెద్దలు నావిషయంలో పెళ్లికిముందే ఇల్లు గుల్లయిపోయింది.

తలమీద చేతులు వేసుకొని నేలమీద చతికిలపడ్డాను

